సరికొత్తగా ఎంవీపీ రైతుబజార్

- 'నాడు-నేడు'కింద ఆధునికీకరణకు చర్యలు
- చేపట్టాల్సిన పనులపై నివేదిక సిద్ధం



ఎంవీపీ రైతుబజార్ ముఖద్వారం



రైతుబజార్‌లో ఉన్న స్టాళ్లు

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్ సరికొత్తగా కనిపించనుంది. నాడు-నేడు పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతుబజార్ల ఆధునికీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందు కోసం నిధులు కేటాయించింది. ఈ మేరకు పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ఎంవీపీ రైతుబజార్‌కు మోక్షం కలగనుంది. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు రైతుబజార్ ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సీఈవో నందకిశోర్ ఈ రైతుబజార్‌ను సందర్శించి ఇక్కడ ఉన్న సౌకర్యాలు, సమస్యలపై ఆరా తీసిన విషయం తెలిసిందే. ఇక్కడ రైతులు, వినియోగదారులతో ఆయన నేరుగా మాట్లాడి ఆధునికీకరణకు ఏవిధమైన హంగులు అవసరమో పరిశీలించారు. సంబంధిత అధికారులతో చర్చించి పూర్తి స్థాయి సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టారు. దీంతో రెండు రోజుల కిందట జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు ఈ రైతుబజార్‌ను సందర్శించి చేపట్టాల్సిన పనులపై నివేదిక సిద్ధం చేశారు. కొద్ది రోజుల్లో టెండర్లు పిలవనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఇవీ సమస్యలు

ఎంవీపీ రైతుబజార్ నగరంలో పెద్దది. ఇక్కడ 178 స్టాళ్లు ఉన్నాయి. వీటిలో అన్ని రకాల కూరగాయలతో పాటు నిత్యావసర సరకులు విక్రయిస్తుంటారు. గిరిజన ఉత్పత్తులు విక్రయించడానికి ప్రత్యేకంగా జీసీసీ స్టాల్ కూడా అందుబాటులో ఉంది. రుషికొండ, ఎండాడ నుంచి ఇటు ఆరిలోవ, వెంకోజీపాలెం, మద్దిలపాలెం, ఇసుకతోట, లాసెన్స్‌బే కాలనీ వరకు కూరగాయల కోసం వినియోగదారులు ఈ రైతుబజార్‌కే వస్తుంటారు. దీంతో రోజూ ఈ రైతుబజార్‌కు వినియోగదారుల తాకిడి ఉంటుంది. ఆది, మంగళవారాలతో పాటు సెలవు రోజులు, పండగ రోజుల్లో మరింత రద్దీగా ఉంటుంది. ఇంత ప్రాధాన్యం ఉన్న రైతుబజార్‌లో ప్రస్తుతం పలు సమస్యలతో రైతులు, వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ కరోనా నుంచి పనిచేయని సీసీ కెమెరాలు, ఏడాదిగా వెలగని వీధి దీపాలు, వాచ్‌మన్ లేకపోవడం, షెడ్ల రేకులు శిథిలం కావడం, సుమారు ఏడేళ్ల క్రితం వేసిన రంగులు రూపు మారిపోవడం తదితర సమస్యలు తిష్టవేశాయి. ఆ సమస్యలకు ఇప్పుడు పరిష్కారం లభించనుంది.

తక్షణం రూ.15 లక్షలతో పనులు

జిల్లాలో రైతుబజార్ నిధుల నుంచి రూ.15 లక్షలుతో అభివృద్ధి పనులు తక్షణం ఇక్కడ చేపట్టనున్నారు. ఇక్కడ 12 సీసీ కెమెరాల ఏర్పాటు, ఏడు చోట్ల విద్యుత్ దీపాలు అమర్చడం, షెడ్‌లపైన, ఆవరణంలోను కొత్త రేకులతో పైకప్పులు ఏర్పాటు, వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా పెద్ద సైజులో ధరల బోర్డు ఏర్పాటు, గోడలకు ఆకర్షణీయమైన రంగులు వేయడం, ఆర్గానిక్ స్టాల్స్‌లో అన్ని రకాల వస్తువులు అందుబాటులో ఉండేలా చేయడం, తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. నాడు-నేడు నిధులతో ప్రధాన ద్వారాల వద్ద బోర్డులు ఏర్పాటు, పార్కింగ్ క్రమబద్ధీకరణ తదితర వాటితో మరింత ఆధునికీకరణకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

నాడు-నేడు కింద త్వరలో పనులు

రైతుబజార్లను నాడు-నేడులో అభివృద్ధి చేయనున్నాం. ఇందులో భాగంగా ఎంవీపీ రైతుబజార్ ఆధునికీకరించనున్నాం. దీనికోసం టెండర్లు పిలుస్తున్నాం. ఇక్కడ సీసీ కెమెరాలు, వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. గోడలకు పెయింటింగ్ వేయడంతో పాటు కొత్తగా పైకప్పులు అమర్చుతాం. రెండు వారాల క్రితం ఈ రైతుబజార్‌ను సందర్శించిన సీఈవో నందకిశోర్, మూడు నెలల క్రితం సందర్శించిన మార్కెట్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే ఆదేశాల ప్రకారం ఆధునికీకరణ పనులు త్వరలో ప్రారంభిస్తాం.

– యాసిన్, జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెంటింగ్ అధికారి

తోటగరువు హైస్కూల్‌లో జోరుగా ప్రవేశాలు



తోటగరువు హైస్కూల్

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్తగా ప్రవేశాలు జోరుగా సాగుతున్నాయి. వేసవి సెలవులు ముగిసిన అనంతరం ఈ నెల 12న పాఠశాలలు పునః ప్రారంభించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఉపాధ్యాయులు కొత్తగా విద్యార్థులను పాఠశాలలో చేర్చుకుంటున్నారు. వివిధ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలతో పాటు ఆరిలోవ ప్రాంతంలో పలు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ఇక్కడ చేరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు ఉచితంగా జగన్న విద్యా కానుక కిట్లు, మధ్యాహ్న భోజనం, అమ్మఒడి పతకాలు అందిస్తుండడంతో ఆకర్షితులైన తల్లిదండ్రులు ఇక్కడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చేర్పించడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ 130 మంది విద్యార్థులు ఆరు నుంచి పదో తరగతి వరకు చేరినట్టు హెచ్ఎం కె.దుర్గాభవాని తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ సుమారు 1700 మంది విద్యార్థులు ఉన్నారన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతి అందజేస్తున్న జియ్యాని శ్రీధర్, దాసరి సత్తిబాబు

సింహాచలం: జీవీఎంసీ 93వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దివంగత దాసరి రాజు జ్ఞాపకార్థం రెండు రోజుల పాటు విరాట్‌నగర్‌లోని ఏపీఈపీడీసీఎల్ గ్రౌండ్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి వైఎస్సార్ ఫుట్ బాల్ కప్ టోర్నీ ఆదివారంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 16 స్కూళ్ల నుంచి 16 జట్లు ఈటోర్నీలో పాల్గొన్నాయి. విశాఖ వ్యాలీ స్కూల్ జట్టు విజేతగా నిలిచింది. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ విజేతలకు ట్రోఫీ, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు, వినోద్, 98వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు నడింపల్లి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు విశేష స్పందన



ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో సందేహాలు నివృత్తి చేసుకుంటున్న విద్యార్థులు

బీచ్ రోడ్డు: విదేశాల్లో విద్యాభ్యాసంపై అవగాహన కోసం ఐవీ ఓవర్సీస్ సంస్థ ఏర్పాటు చేసిన గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్-2023కు విశేష స్పందన లభించింది. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్, జేఎన్‌టీయూ విజయనగరం రిజిస్ట్రార్ డాక్టర్ స్వామి నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలని చాలా మందికి ఉన్నా.. ఎలా ప్రవేశం పొందాలి, ఏ విద్యా సంస్థలు మంచివి అనే అంశాలు తెలియక ఇబ్బంది పడుతున్నారన్నారు. అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియా, ఐర్లాండ్‌కు చెందిన 33 ప్రముఖ యూనివర్సిటీలు ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు హాజరై సుమారు 300 మంది విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐవీ సంస్థ వ్యవస్థాపకులు బి.రామ్‌కుమార్, బి.శ్రీనివాసరావు, మార్కెట్ హెడ్ వెంకట రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు



బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతల

విశాఖ స్పోర్ట్స్: ఏయూ వ్యాయామ హాల్‌లో ఆదివారం జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో పలు స్థానిక జట్లు డబుల్స్ విభాగంలో ఉత్సాహంగా తలపడ్డాయి. ఈ పోటీల్లో సురేష్, మధు జోడి విజేతగా నిలిచింది. రమేష్, జయంత్ జోడి రన్నరప్‌గా, మూర్తి, ప్రసాద్ జోడి సెకండ్ రన్నరప్‌గా నిలవగా.. లోకేష్, సాయి జోడి నాలుగో స్థానంలో నిలిచింది. పోటీల ముగింపు కార్యక్రమానికి ఏయూపీఈ విభాగ సంచాలకుడు విజయ్‌మోహన్ హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో పాల్గొని రాణించాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయి 'జగనన్న ఆణిముత్యాలు'కు కేజీబీవీ విద్యార్థినులు



భారతి, రేవతి

ఆనందపురం : మండలంలోని నేల్తేరులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ఇచ్చే జగనన్న ఆణి ముత్యాలు అవార్డుకు ఎంపికయ్యారు. మంగళవారం అమరావతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు. ఎన్. భారతి అనే విద్యార్థిని పదో తరగతిలో 600 మార్కులకు 588 సాధించి జిల్లా స్థాయిలో కేజీబీవీ పాఠశాలల విద్యార్థుల్లో టాపర్‌గా నిలిచి రూ.50 వేలు నగదు పురస్కారాన్ని అందుకుంది. రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి ముఖ్యమంత్రి చేతులు మీదుగా రూ.75 వేలు నగదు పురస్కారాన్ని అందుకోనుంది. ఈమె నియోజకవర్గ స్థాయిలో అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రూ.10 వేలు, పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచినందుకు మరో రూ.3 వేలు నగదు బహుమతి అందుకుంది. అలాగే ఇదే పాఠశాలకు చెందిన ఇ.రేవతి అనే విద్యార్థిని 600 మార్కులకు 585 సాధించి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించి ముఖ్యమంత్రి చేతులు మీదుగా రూ.50 వేలు నగదు బహుమతిని అందుకోనుంది. ఆమె జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి రూ.30 వేలు, పాఠశాలలో ద్వితీయ స్థానం సాధించి రూ.2 వేలు చొప్పున నగదు బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యాలయం ప్రత్యేకాధికారి చంద్రకళ మాట్లాడుతూ ఇక్కడి విద్యార్థులు రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యా రంగంలో చేపట్టిన మార్పులు వల్లే ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని చెప్పారు. ఈ మేరకు విద్యార్థులను పలువురు అభినందించారు.

క్లుప్తంగా

శ్రావ్యంగా గాత్ర కచేరి



గాత్ర కచేరి చేస్తున్న తేజశ్వరీ, బమ్మిడిపాటి వీణాదరి

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ అధ్వర్యంలో ఆదివారం మద్దిలపాలెం కళాభారతిలో జరిగిన గాత్రకచేరి శ్రావ్యంగా సాగింది. వర్ధమాన గాత్ర కళాకారులు లంక తేజశ్వరీ, బమ్మిడిపాటి వీణాదరి తమ గాత్రంతో అలరించారు. ఈ కార్యక్రమంలో కళాభారతి అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, లలిత, చంద్రశేఖర్, వీరఘంట చంద్రశేఖర్, ఎంఎస్ శ్రీనివాస్, అయ్యగారి భుజంగరావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు ఏయూ డాక్టరేట్

ఎంవీపీ కాలనీ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ ఫిజికల్ డైరెక్టర్, సమత కళాశాల మాజీ ఫిజికల్ డైరెక్టర్ గొలగాని వెంకటేశ్వరరావుకు ఏయూ డాక్టరేట్ లభించింది. ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్స్ విభాగం ద్వారా ‘ఏ స్టడీ ఆన్ ది డిఫరెన్స్ బిట్వీన్ సెలెక్టడ్ మోటర్ ఫిట్‌నెస్ అండ్ ఆన్త్రోపోమెట్రిక్ వేరిబుల్స్ ఆఫ్ జూనియర్ కాలేజ్ కబడ్డీ ప్లేయర్స్ ప్లేయింగ్ ఇన్ డిఫరెంట్ పొజిషన్స్’అనే అంశంపై చేసిన పరిశోధనకు వెంకటేశ్వరరావుకు వర్సిటీ డాక్టరేట్ వరించింది. ఈ మేరకు వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి నుంచి ఆయన డాక్టరేట్ ఉత్తర్వులు అందుకున్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్, ఏయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్, వర్సిటీ ఉన్నతాధికారులు, ఆచార్యులు, పరిశోధకులు వెంకటేశ్వరరావును అభినందించారు.

నేడు డయల్ యువర్ ఆర్డీవో

మహారాణిపేట: విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ సోమవారం డయల్ యువర్ ఆర్డీవో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి, మహారాణిపేట, ములగాడ, గోపాలపట్నం తదితర ప్రాంతాల తహసీల్దార్ల కార్యాలయాల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం నిమిత్తం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రజలు 0891-2562977 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యను తెలియజేయాలి.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహ స్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

వడదెబ్బకు వ్యక్తి మృతి?

మత్రిపాలెం: మద్యానికి బానిసై, ఇంటికి దూరంగా ఉంటున్న ఒక వ్యక్తి మరణించిన సంఘటన ఇది. ఐదో పట్టణ పోలీసులు ఆదివారం తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ధర్మానగర్‌లో పిల్లా రజనీకుమార్(50), భార్య రమాదేవి, ఇద్దరు కుమారులతో కలిసి నివసిస్తున్నాడు. ఇతడు మద్యానికి బానిసై భార్యతో మనస్పర్థల కారణంగా ఐదు నెలలుగా ఇంటికి వెళ్లకుండా రోడ్డుపైనే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఊర్వశి జంక్షన్ వద్ద కూర్చుని ఉన్న రజనీకుమార్ ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందాడు. ఎండలకు వడదెబ్బ తగలడం వల్లే మరణించి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.విజయకుమార్ పర్యవేక్షణలో ఏఎస్ఐ రాజారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గురుకులంలో ఆకట్టుకుంటున్న చిత్రాలు



శ్రీకృష్ణాపురం గురుకులంలో విద్యార్థులు వేసిన చిత్రాలు

ఆరిలోవ: శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో విద్యార్థులు చిత్ర లేఖనంలో ప్రతిభ చూపుతున్నారు. గతేడాది విద్యార్థులు వేసిన చిత్రాలతో గురుకులం ఉపాధ్యాయులు ఓ గదిని ఎగ్జిబిషన్ మాదిరిగా తీర్చిదిద్దారు.

రకరకాల పువ్వులు, పక్షులు, జంతువులతో పాటు పల్లెటూరు అందాలు, ఉదయించే సూర్యుడు, వెన్నెలలో చంద్రుడు, గంగిరెద్దులు ఆడించడం, రైతులు పొలం పనులకు వెళ్లడం, జాలర్లు చేపలు వేట వంటి చిత్రాలు ఔరా అనిపిస్తున్నాయి. గురుకులానికి వెళ్లిన అతిథులు, అధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఈ చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి.

నాన్నకు ప్రేమతో...



ర్యాంప్ వాక్ చేస్తున్న తండ్రి, కుమార్తె

బీచ్ రోడ్డు: ఫాదర్స్ డే సందర్భంగా ల్యాండ్ పవర్ ఆధ్వర్యంలో వీరుమామ ఆదివారం నిర్వహించిన నాన్నకు ప్రేమతో కార్యక్రమం సందడిగా సాగింది. బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పిల్లలు తమ తండ్రులతో కలిసి ర్యాంప్ వాక్ చేసి మురిసిపోయారు. తెలుగు చిత్రాల్లో తండ్రికి సంబంధించిన డైలాగులతో నిర్వహించిన స్పెషల్ రౌండ్స్ ఆహూతులను అలరించాయి. తెలుగు అమ్మాయిల నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నివారణ కోసం తండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు.

ఘనంగా అప్పన్న తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: అమావాస్య పురస్కరించుకుని సింహగిరిపై ఆదివారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి తిరువీధి ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను పల్లకీలో అధిష్టింపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ఆర్జిత సేవలు

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. అలాగే అప్పన్నస్వామికి నిత్యకల్యాణం కనుల పండువగా జరిగింది.

సంప్రదాయ కళలను ఆదరించాలి



కళాకారులకు బహుమతులు అందజేస్తున్న బాలకొండలరావు

దాబాగార్డెన్స్: సంప్రదాయ కళలకు ప్రాధాన్యమివ్వాలని నృత్య కళాకారిణి ఏబీ బాలకొండలరావు అన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నాట్య పరిమళ మ్యూజికల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సంగీతం, నృత్యంపై ఆదివారం నిర్వహించిన నైపుణ్య శిక్షణలో విజేతలుగా నిలిచిన వారికి ఆమె బహుమతులు అందజేశారు. సభాధ్యక్షుడు ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ భారతీయ సనాతన సంప్రదాయంలో భాగమైన కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వంకాయల సన్యాసిరాజు సంస్థ ద్వారా కళా రంగానికి సేవలందిస్తున్న లిపికారెడ్డి, డాక్టర్ వై. బాలగణేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో చెన్నా తిరుమలరావు, పి.శశిలత కృష్ణ, సత్యనారాయణరెడ్డి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మంచిగా నడుచుకోండి



ద్వారకా పీఎస్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ ధర్మేంద్ర

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ధర్మేంద్ర మాట్లాడుతూ ఎటువంటి నేరాల జోలికి పోకుండా మంచిగా నడుచుకోవాలని వారికి సూచించారు. మద్యం షాపుల వద్ద గొడవలు చేయడం, తగాదాల్లో తలదూర్చడం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతంగా జీవించాలని హితవు పలికారు. అనంతరం రౌడీ షీటర్లను వారి ఇంటి వద్ద పోలీస్ సిబ్బంది అప్పగించారు.

ఫోర్త్ టౌన్ పీఎస్‌లో..

ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీ షీటర్లకు ఎస్ఐలు గౌరి, మోహన్‌రావు కౌన్సెలింగ్ నిర్వహించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు.

పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాలు



సీసీ కెమెరాల దృశ్యాలను టీవీలో పర్యవేక్షిస్తున్న సీఐ శ్రీనివాసరావు

సీతమ్మధార: స్థానిక ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. స్టేషన్‌లోని ముగ్గురు ఎస్ఐల రూమ్‌లతోపాటు హెడ్ కానిస్టేబుల్, కంప్యూటర్ రూమ్, బయట, హాల్, ఇతర ప్రదేశాల్లో వాటిని అమర్చారు. సీఐ రూంలో టీవీ ఏర్పాటు చేసి సీసీ కెమెరాల రికార్డయ్యే దృశ్యాలను పరిశీలిస్తున్నారు. మొత్తం ఎనిమిది కెమెరాల ద్వారా ఉద్యోగుల విధులను పర్యవేక్షించనున్నారు. వీటి ద్వారా అవినీతిని అరికట్టడంతోపాటు సిబ్బంది పనితీరు తెలుస్తుంది. ఇటీవల కాలంలో పోలీస్ స్టేషన్ నుంచి గంజాయి నిందితులు బేడీలతో పరారీ కావడంతో సీపీ ఆదేశాల మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

సందడిగా సాగరతీరం




ఆర్కే బీచ్‌లో నగరవాసుల సందడి

బీచ్‌రోడ్డు: ఆదివారం ఉదయం నుంచి ఉక్కపోత, గాలి లేక ఎర్రటి ఎండతో ఉక్కిరిబిక్కిరి అయిన నగరవాసులు ఉపశమనం పొందేందుకు సాయంకాలం సాగరతీరాన్ని ఆశ్రయించారు. గంటల తరబడి సముద్రంలో స్నానాలు చేసేందుకు ఆసక్తి కనబరిచారు. భీమిలి, సాగర్‌నగర్, రుషికొండ, ఆర్కే బీచ్‌లలో ఒక్కసారిగా పర్యాటకుల తాకిడి పెరిగింది.

ఉక్కు పోరాటం ఆగదు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని విరమిస్తూ పార్లమెంట్‌లో ప్రకటన చేసే వరకు ఉక్కు పోరాటం ఆగదని స్టీల్ హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద స్టీల్ హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి జి.గణపతిరెడ్డి, అధ్యక్షులు దొమ్మేటి అప్పారావు ఆధ్వర్యంలో 857వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులను పాల్గొన్నారు. కేంద్రంలో పాటు ప్రస్తుత విశాఖ ఉక్కు యాజమాన్యం ప్రైవేటీకరణలో భాగంగా కేంద్రానికి సహకరిస్తూ ప్లాంట్‌ను నష్టాల్లో నడుపుతున్నారని, వీరి ప్రయత్నాలు సాగవని హెచ్చరించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన పోలీసులకు ప్రోత్సాహకం



సీపీ నుంచి నగదు ప్రోత్సాహం అందుకుంటున్న సాయిబాబా, శ్రీను

పద్మనాభం: విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సభ్యులను కిడ్నాపర్ల బారి నుంచి కాపాడిన పద్మనాభం పోలీస్ స్టేషన్‌కి చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లకు నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ నగదు ప్రోత్సాహకాలు ఆదివారం అందజేశారు. పద్మనాభం పోలీస్ స్టేషన్‌కి చెందిన కానిస్టేబుల్ ఎస్.శ్రీను, హోమ్‌గార్డు వి.సాయిబాబా ఈ నెల 15న ఆనందపురం మండలం పందలపాక వద్ద ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ భార్య జ్యోతి, కుమారుడు శరత్ చంద్ర, ఆడిటర్ జీవీలను కిడ్నాపర్ల బారి నుంచి కాపాడారు. ఈ క్రమంలో కిడ్నాపర్లను పట్టుకున్నారు. దీంతో వీరికి ఒక్కొక్కరికి సీపీ నగరంలోని తన కార్యాలయంలో రూ.5 వేలు చొప్పున నగదు అందజేశారు.